### రేపు టీయూ వీసీగా బాధ్యతలు చేపట్టనున్న యాదగిరిరావు

డిచ్‌పల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం వీసీ యాదగిరిరావు సోమవారం విధుల్లో చేరనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ ఆయనను వీసీగా నియమించారు. కాకతీయ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన అక్కడి నుంచి రిలీవ్ కానున్నారు. ఆ తర్వాత సోమవా రం విశ్వవిద్యాలయానికి వచ్చి బాధ్యతలను చేపట్టనున్నారు. ఈ మేరకు ఆయన విశ్వవిద్యాలయం అధికారులకు సమాచారం అందించారు. ఆయనకు స్వాగతం పలకడంతో పాటు బాధ్యతలు తీసుకునేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.



ఇందిరమ్మ ఇళ్ల కమిటీల ఏర్పాటుకు

# కసరత్తు

ఇందిరమ్మ ఇండ్లు

ఇల్లు లేని వారికి
ఇంటి స్థలం & ₹5 లక్షలు
ఉద్యమకారులకు
250 చ.గ. ఇంటి స్థలం



- అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కమిటీల ఏర్పాటు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో కమిటీలదే కీలక పాత్ర
- జిల్లావ్యాప్తంగా కమిటీలో చోటు కోసం నాయకుల పోటీ

నిజామాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నారు. గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపాలిటీలు, నగర కార్పొరేషన్ పరిధిలో వార్డుల వారిగా ఇందిరమ్మ కమిటీలకు సభ్యుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం కమిటీ సభ్యుల ఎంపికను కొనసాగించడంతో పాటు మహిళలతో పాటు ఇతర సభ్యులను నియమిస్తున్నారు. గ్రామ పంచాయతీలతోపాటు మున్సిపాలిటీల్లో ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత కలెక్టర్ జాబితాను ప్రకటించనున్నారు. ఈ కమిటీల కోసం గ్రామాల్లో పోటీ భారీగా పెరిగింది. అధికార పార్టీకి చెందిన నేతలు పోటీ పడుతున్నారు. కమిటీలో చోటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, ఇతర నేతల ద్వారా జాబితాను సిద్ధం చేస్తున్నారు. గ్రామాల్లో పనిచేసిన వారికి ఈ కమిటీలో చోటు కల్పిస్తున్నారు. మొదటి నుంచి ఉన్న నేతలతో పాటు కొత్తగా చేరిన వారికి కూడా అవకాశం కల్పిస్తున్నారు. కొన్ని గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో కమిటీల కోసం పోటీ కూడా బాగా పెరగడంతో నేతలు గొడవలు లేకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. నిబంధనల మేరకు అధికారులు ఒకటి రెండు రోజుల్లో ఈ జాబితాను ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**● కమిటీ చైర్మన్‌గా ప్రత్యేకాధికారి**

రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీల ఎంపిక కోసం ఈనెల 10న జీవోను విడుదల చేసింది. అన్ని గ్రామ పంచాయతీల్లో, మున్సిపాలిటీల్లో సభ్యులను ఎంపిక చేయాలని కోరింది. జిల్లాలో మొత్తం 545 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో కమిటీల ఎంపిక దాదాపు పూర్తి కావస్తోంది. మున్సిపాలిటీలోనూ ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ లేదా స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గా ఉంటారు. గ్రామ కార్యదర్శి కన్వీనర్‌గా కొనసాగుతారు. వీరిద్దరూ కాకుండా ఐదుగురు సభ్యులను ఎంపిక చేస్తున్నారు. వీరిలో మహిళా గ్రూపు నుంచి ఇద్దరు సభ్యులతోపాటు గ్రామాభివృద్ధిలో కీలకమైన పాత్ర పోషిస్తున్న ఎస్సీ, ఎస్టీ నుంచి ఒకరు, బీసీ నుంచి ఒకరు, ఇతరుల నుంచి ఒకరిని నియమిస్తారు. మొత్తంగా ఏడుగురిని సభ్యులుగా నియామకం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవోకు అనుగుణంగా ఈ ఎంపిక ప్రక్రియ కొనసాగిస్తున్నారు. మున్సిపాలీటీలు, కార్పొరేషన్ పరిధిలో కూడా ఎంపిక ప్రక్రియ కొనసాగిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో డివిజన్ వారిగా మున్సిపాలిటీలో వార్డుల వారిగా ఈ ఇందిరమ్మ కమిటీలను ఎంపిక చేస్తున్నారు. ఈ కమిటీకి చైర్మన్‌గా కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ వ్యవహరిస్తారు. ఆ డివిజన్ లేదా వార్డుకు సంబంధించిన అధికారి కన్వీనర్‌గా ఉంటారు. ఆ డివిజన్ లేదా వార్డు పరిధిలోని సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌కు చెందిన ఇద్దరు మహిళలను, ఎస్సీ, ఎస్టీ నుంచి ఒకరు, బీసీ నుంచి ఒకరు, ఇతరుల నుంచి ఒకరిని నియమిస్తున్నారు. నిబంధనల ప్రకారం కమిటీలో చైర్మన్, కన్వీనర్‌తో కలిసి మొత్తం ఏడుగురు సభ్యులు ఉంటున్నారు. గ్రామాల్లో సర్పంచులు లేనందున ప్రత్యేక అధికారులే చైర్మన్‌గా కమిటీలు వేస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో సభ్యులను ఎంపిక చేస్తూ మండల ఎంపిడివో ఆధ్వర్యంలో ఆయా గ్రామాల జాబితాను కలెక్టర్‌కు పంపిస్తున్నారు. మున్సిపాలిటీల పరిధిలో వార్డులు, డివిజన్ల వారిగా వచ్చే కమిటీల జాబితాను కమీషనర్‌లు కలెక్టర్‌కు పంపిస్తున్నారు. వీటిని పరిశీలించిన తర్వాత ఒకటి రెండు రోజుల్లో ఆయన ఇందిరమ్మ కమిటీల జాబితాను ఫైనల్ చేయనున్నారు.

**● కమిటీలో స్థానం కోసం పోటీ**

జిల్లాలో ఈ ఇందిరమ్మ కమిటీల ఎంపికకు భారీ పోటీ నెలకొంది. అధికార పార్టీకి చెందిన ఎక్కువ మంది కమిటీలో చోటుకోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామాల్లో ఉన్న పార్టీ నేతలకు సంబంధించిన వారు కమిటీలో ఉండే విధంగా చూసుకుంటున్నారు. కొన్ని మండలాల పరిధిలో పోటీ ఎక్కువగా ఉండగా మరికొన్ని మండలాల్లో కొత్తగా పార్టీలో చేరిన వారి వల్ల పోటీ మరింత పెరిగింది. పాత కొత్త కళయికతో కమిటీ సభ్యులను ఎంపిక చేస్తున్నారు. కొన్నిచోట్ల వివాదాలకు తావివ్వకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు కూడా జాబితాలను ఇస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కమిటీ సభ్యుల పాత్ర ఉండటంతో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు అయిన తర్వాత పూర్తయ్యేంతవరకు కమిటీలు పనిచేయాల్సి ఉండటంతో ఎక్కువమంది పోటీ పడుతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు లేని చోట పార్టీ ఇన్‌చార్జిలు కూడా క్యాడర్‌కు అవకాశం కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే అన్ని గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో జాబితాలు సిద్ధం కాగా పోటీ ఎక్కువగా ఉండటంతో నేతలు కొంత మార్పులు చేర్పులు కూడా చేస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో జాబితా ఫైనల్ చేసి ఇందిరమ్మ కమిటీలను ప్రకటించే అవకాశం ఉంది. జిల్లా ఇంచార్జి మంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లి జాబితాను ఫైనల్ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇందిరమ్మ కమిటీలకు పోటీ మాత్రం ఎక్కువగా ఉండటంతో పార్టీ నేతలు కూడా తమ అనుచరులకు వచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. గ్రామ స్థాయిలో అధికారులు కూడా అధికార పార్టీ నేతల సూచనలు పాటిస్తూ కమిటీల ఎంపికలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కమిటీల ప్రకటన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక చేసే అవకాశం ఉంది. ఈ కమిటీ పేదలను ఎంతమేరకు గుర్తించి ఇళ్లను మంజూరు చేస్తుందో వేచి చూడాలి.



## హామీల అమలులో.. కాంగ్రెస్ విఫలం

● ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను సీఎం అమలు చేయాలి: మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఈటెల రాజేందర్, పక్కన అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన రుణమాఫీ అమలు చేయడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఆరోపించారు. నిజామాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతు డిక్లరేషన్‌ను అమలు చేస్తామని ప్రకటించారని అన్నారు. వాటిలో ఏ ఒక్క హామీని ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీ ఇప్పటికీ పూర్తిస్థాయిలో చేయలేదన్నారు. రైతుల్లో ప్రభుత్వంపైన తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. రుణమాఫీతోపాటు రైతుభరోసా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజల్లో విశ్వాసం పోతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీగా ప్రభుత్వాన్ని నిలదీసే హక్కు, కర్తవ్యాలు తమకు ఉంటాయని అన్నారు. ప్రతిపక్ష పార్టీలమీద ఆరోపణలు చేస్తే వచ్చేది ఏమీ లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా అన్నిఅమలు చేయాలన్నారు. కొత్త పెన్షన్లను అధికారంలోకి రాగానే ఇస్తామని ప్రకటించారని అన్నారు. ఇప్పటి వరకు వాటి అమలు ఊసేలేదని ఆయన విమర్శించారు. వికలాంగుల నుంచి వృద్ధుల వరకు పెన్షన్‌ను ఇచ్చిన హామీలో భాగంగా పెంచలేదన్నారు. వృద్ధులకు ఇస్తున్న 2వేల పెన్షన్‌ను 4వేలు చేయలేదన్నారు. ఒంటరి మహిళలు, వితంతువులకు ఇప్పటి వరకు పెన్షన్లు కొత్తవారికి ఇవ్వడం లేదన్నారు. 60ఏళ్లు దాటిన వారికి కూడా కొత్త పెన్షన్లను మంజూరు చేయడం లేదని ఆయన విమర్శించారు. కొత్తపెన్షన్లు ఏమో కానీ ఉన్న పెన్షన్లనే సదరం క్యాంపులు పెట్టి చీట్ చేస్తున్నారని విమర్శించారు. ప్రజల దృష్టిని మరలించేందుకే మూసీ ప్రక్షాళణ కోసం లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామని ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. నిధులే లేవంటున్న ప్రభుత్వం మూసీ ప్రక్షాళణ కోసం నిధులను ఎక్కడి నుంచి తీసుకువస్తారని ప్రశ్నించారు. హైదరాబాద్ ఆదాయం గణనీయంగా తగ్గిపోతున్నాయని వార్తలు వస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ నేతలే ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. హైడ్రా సమస్య, మూసీ ప్రక్షాళణపై పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. జీవో 29ని సవరించాలన్నారు. రాజ్యాంగబద్ధమైన జీవోలను అమలుచేయాలన్నారు. హైదరాబాద్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ర్యాలీని అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో గ్రూప్-1 అభ్యర్థుల కోరిక మేరకు పరీక్షలను వాయిదా వేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్ష పార్టీలను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనకు తాము మద్దతు ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా హామీలను అమలు చేయకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఒత్తిళ్లు తెస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వస్తుందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలోపు హామీలను అమలు చేయకుంటే ప్రజలే తగిన తీర్పు ఇస్తారని ఆయన అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, రాష్ట్ర కార్యదర్శి పల్లెగంగారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఇతర నేతలు పాల్గొన్నారు.

## ఇన్‌చార్జి సీపీగా ఎస్పీ సింధూశర్మ

● కామారెడ్డి ఎస్పీని నియమించిన రాష్ట్ర ప్రభుత్వం ● జిల్లాకు వచ్చేందుకు ఐపీఎస్‌ల ప్రయత్నాలు



సింధూ శర్మ

నిజామాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగర పోలీస్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మను నియమించారు. ఈమేరకు ఆమె శనివారం బాధ్యతలను చేపట్టారు. నగర సీపీగా పనిచేసిన కల్మేశ్వర్ సింగనెవార్ బాధ్యతలనుంచి రిలీవ్ కావడంతో ప్రభుత్వం ఇంచార్జి కమీషనర్‌గా ఆమెను నియమించారు. కొత్త కమిషనర్ నియామకం చేసేవరకు ఆమె ఇన్‌చార్జి కమిషనర్ హోదాలో పని చేయనున్నారు. జిల్లా కమిషనర్‌గా పనిచేసిన కల్మేశ్వర్ సింగనెవార్ నేషనల్ పోలీస్ అకాడమిలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరనున్నారు. కేంద్రసర్వీసులకు ఆయన వెళ్లడంతో ఆయనను బదిలీ చేశారు.

**జిల్లాకు వచ్చేందుకు ఐపీఎస్‌ల ప్రయత్నాలు**

నిజామాబాద్ నగర పోలీస్ కమిషనర్ బదిలీ కావడంతో ఇక్కడికి వచ్చేందుకు చాలామంది ఐపిఎస్‌లు ప్రయత్నాలు చేస్తున్నారు. కీలకమైన పోలీస్ కమీషనరేట్ కావడం జిల్లా కూడా నల్గొండ తర్వాత పెద్దది కావడంతో ఎక్కువ మంది ఐపిఎస్‌లు ఇక్కడికి వచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. గతంలో ఏఎస్పీలుగా పనిచేసిన వారితో పాటు ఇతర జిల్లాల్లో పనిచేసిన వారు కూడా ఇక్కడికి వచ్చేందుకు నేతల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. గతంలో పక్క జిల్లాలో పనిచేసిన ఎస్పీలు కూడా ఇక్కడికి కమీషనర్‌గా వచ్చేందుకు మొగ్గు చూపుతున్నారు. తమకు ఉన్న పరిచయాల ఆధారంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. రాష్ట్రంలో కొద్దిరోజుల్లో ఐపిఎస్‌ల బదిలీలు ఉండటంతో వాటిలో భాగంగా నిజామాబాద్ నగర పోలీస్ కమీషనర్‌ను కూడా నియామకం చేయనున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు చెందిన ప్ర జాప్రతినిధులు అభిప్రాయాలను తీసుకొని పోలీస్ కమీషనర్‌ను నియమించనున్నారు. జిల్లాలో ఉన్న పరిస్థితులు, ఇప్పటి వరకు పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన ఆయనకు దగ్గరగా ఉండే వ్యక్తులకే అవకాశం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. వచ్చేది స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో ఆచి తూచి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. గతంలో జిల్లాలో డీఎస్పీలుగా పనిచేసి కన్ఫర్డ్ ఐపీఎస్‌లు అయిన అధికారులు కూడా ఎక్కువ మొత్తంలో ప్రయత్నాలు చేస్తున్నారు. జోన్ పరిధిలో కార్పొరేషన్ కావడం అతి పెద్ద జిల్లా కావడంతో సీనియర్ ఐపీఎస్‌లకే అవకాశం ఇవ్వనున్నట్లు పోలీస్ అధికారుల సమాచారం బట్టి తెలుస్తోంది. వారం లోపు కొత్త కమిషనర్ నియామకం అయ్యే అవకాశం ఉంది. అప్పటి వరకు కామారెడ్డి ఎస్పీనే కమిషనర్‌గా కొనసాగనున్నారు.

## ఎటు చూసినా ధాన్యం కుప్పలే!



● దత్తాపూర్‌లో కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు

- కొనుగోళ్లు ప్రారంభం కాక రోడ్లపై ఆరబోస్తున్న రైతులు
- జిల్లావ్యాప్తంగా పెరుగుతున్న ధాన్యం నిల్వలు
- కొనుగోళ్లు చేపట్టాలని అధికారులపై పెరుగుతున్న ఒత్తిళ్లు



● నందిపేటలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం



నిజామాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ఏ గ్రామరోడ్డు చూసినా ధాన్యం కుప్పలే. గ్రామ, మండల, జిల్లా రోడ్లనీ తేడా లేకుండా రైతులు కల్లాలు లేకపోవడంతో రోడ్లమీద ఆరబోస్తున్నారు. వరికోతలు మొదలై నెలరోజులైనా కొనుగోలు ప్రారంభించకపోవడంతో ఎక్కడికక్కడే కుప్పలు పోసి నిల్వ ఉంచుతున్నారు. కొనుగోలు కేంద్రాలతో పాటు ఇతర ప్రాంతాల్లో ధాన్యం నిల్వలు ఉంచుతూనే అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఇంకా కొనుగోళ్లపై స్పష్టత ఇవ్వకపోవడం నిబంధనలు ప్రకటించకపోవడంతో కేంద్రాలు ఏర్పాటు చేసిన ధాన్యాన్ని కొనడం లేదు. కొంత మంది రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్న మిగతా రైతులు బోనస్ రానుండటంతో ధాన్యాన్ని ఆరబోసి రోడ్లపైనే ఉంచుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వరికోతలు మొదలు కావడంతో రైతుల నుంచి వస్తున్న ఒత్తిళ్లు, విజ్ఞప్తులతో అధికారులు కూడా ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రానుండటంతో ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

**కోతలు మొదలై నెల గడుస్తున్నా..**

జిల్లాలో వరి కోతలు మొదలై నెలరోజులు అవుతున్నా నేటికీ ప్రభుత్వం కొనుగోళ్లు చేపట్టలేదు. జిల్లా వ్యాప్తంగా వరి కోతలు మొదలు కావడంతో రైతులు ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని ఆర బోస్తున్నారు. కల్లాలు ఎక్కువగా లేకపోవడంతో రోడ్లను ఆశ్రయిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పంట చేతికి వస్తుండటం, కొనుగోళ్లు మొదలుకాకపోవడంతో రైతులు కొన్నిచోట్ల కల్లాల్లో ఆరబోస్తుండగా మరికొన్ని గ్రామాల పరిధిలో రోడ్లపైనే పోస్తున్నారు. గ్రామీణ రోడ్లతోపాటు మండల, జిల్లాతోపాటు జాతీయ రహదారులపైన కూడా ఆరబోస్తున్నారు. రోడ్లకు ఒకవైపు ఆరబోస్తూ ధాన్యం కుప్పలను ఉంచుతున్నారు. జిల్లావ్యా ప్తంగా కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడం వల్ల కొంతమంది రైతులు ధాన్యాన్ని ముందస్తుగానే అమ్మకాలు చేయగా మరికొంత మంది రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మేందుకు సిద్ధమవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమ లేకుండా నిబంధనల ప్రకారం మద్దతుధరకు కొనుగోలు చేసే అవకాశం ఉండటంతో రైతులు కోసిన ధాన్యాన్ని రోడ్లపైనే ఆరబోస్తున్నారు. జిల్లాలో ఏవైపు వెళ్లిన రోడ్లపైనే ధాన్యం కుప్పలే కనిపిస్తున్నాయి. రోడ్లన్నీ ధాన్యంతోనే నిండిపోయి ఉన్నాయి. రోడ్లపై ధాన్యం పోయవద్దని ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయా ప్రాంతాల్లో పోలీసులు అడ్డుచెబుతున్నా రైతులకు ఎక్కడా ఆరబోసే పరిస్థితి లేకపోవడంతో రోడ్లను ఆశ్రయిస్తున్నారు. పంట కోసిన పొలాల్లో తేమ ఎక్కువగా ఉండటం వల్ల తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్లపైన ఆరబోస్తున్నారు.

**బోనస్‌పై రాని స్పష్టత**

జిల్లాలో ఇప్పటివరకు కొన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన ధాన్యం మాత్రం ఇంకా తీసుకోవడం లేదు. ప్రభుత్వం నుంచి కొనుగోలుతో పాటు స్పష్టమైన ఆదేశాలు బోనస్‌పైన రాకపోవడంతో అధికారులు ఇంకా ధాన్యం కొనుగోలు చేయడం మొదలు పెట్టలేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో ఈదఫా 8లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా 480 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కావాల్సిన అన్ని వసతులను ఈ కొనుగోలు కేంద్రాల్లో కల్పించడంతో పాటు అవసరమైన ఏర్పాట్లను చేశారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాకపోవడం వల్ల ఇప్పటి వరకు ధాన్యాన్ని సేకరించడం లేదు. ఆలస్యమవుతుండటంతో రైతులు కూడా కొంత మంది ప్రైవేటు వ్యాపారులకు, మిల్లర్లకు తక్కువ ధరకే అమ్మకాలు చేస్తున్నారు. ధాన్యం మద్దతు ధరకు కొనడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు 500 రూపాయల బోనస్‌పైనే ఇంకా విధివిధానాలు విడుదల కాలేదు. ఇవేకాకుండా ధాన్యం మిల్లర్లకు కేటాయించే విషయంపైన ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదు. మిల్లర్ల నుంచి గ్యారంటీ తీసుకొని కేటాయింపులు చేయాలా లేక గతంలో లాగానే కేటాయింపులు చేయాలనే అంశాలపైన ఇంకా ఉత్తర్వులను జారీ చేయలేదు. వచ్చే సోమవారం లేదా మంగళవారంలోపు ఈ ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారుల సమాచారం బట్టి తెలుస్తుంది. జిల్లా వ్యాప్తంగా కొనుగోలు మొదలుపెట్టకపోవడంతో ధాన్యం నిల్వలు మాత్రం భారీగా రోజురోజుకు పెరగిపోతున్నాయి. రైతుల నుంచి ఒత్తిళ్లను కూడా అధికారులపైన పెరుగుతున్నాయి. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం ఆధారంగా జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు మొదలయ్యే అవకాశం ఉంది.

## కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐలాపూర్ సొసైటీ చైర్మన్ మీసాల

నందిపేట, అక్టోబరు 19: మండలంలోని ఐలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని గ్రామాల్లో నాలుగు వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మెన్ సిద్దాపురం మీసాల సుదర్శన్ ప్రారంభించారు. కంఠం, ఐలాపూర్, వెల్మల్, నందిపేట గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చైర్మన్ సుదర్శన్ మాట్లాడుతూ ఏ గ్రేడు (దొడ్డురకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2,320, బీ గ్రేడు (సన్నరకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2,300 ధర ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సుదర్శన్ కోరారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో దాసరి నరహరి, వివిధ పార్టీల నాయకులు మందమహిపాల్, ఏర్రం మురళి, సయ్యద్‌హుస్సెన్, సొసైటీ డైరెక్టర్లున్నారు.

## నాళేశ్వర్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు

నవీపేట,అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో శనివారం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు అందజేశారు. గత సంవత్సరం గ్రామానికి చెందిన పలువురు తమ ఆసుపత్రి ఖర్చులకు సంబంధించిన బిల్లుల కోసం నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించి చెక్కులను బాధితులకు అందజేశారు.

## టీబీ వ్యాధి రాకుండా జాగ్రత్త పాటించాలి

మోస్రా, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవూర్‌లో గ్రామపంచాయతీ కార్యాలయంలో జిల్లా టీబీ వైద్యాధికారి అర్షద్ ఆధ్వర్యంలో గ్రామప్రజలకు టీబీ పట్ల జాగ్రత్త పాటించాలని దగ్గు రెండు వారాలుగా వస్తూనే ఉంటే కచ్చితంగా టీబీపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యం కోసం వచ్చిన వారిని పరీక్షించి 14 మంది దగ్గు తేమడ నమూనా సేకరించి పరీక్ష నిమిత్తం జిల్లా ఆసుపత్రికి పంపించారు.

## కుకునూర్‌లో విద్యార్థులకు ఐడీకార్డుల అందజేత



విద్యార్థులకు ఐడీకార్డులు అందజేస్తున్న హెచ్‌ఎం హరిచరణ్

వేల్పూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుకునూర్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఐడీ కార్డులను పాఠశాల హెచ్‌ఎం హరిచరణ్ అందజేశారు. దాత మిర్యాల కోమల్ రూ.5వేల విరాళాన్ని అందించడంతో ఆ డబ్బులతో పాఠశాలలో 6నుంచి 10వ తరగతికి చెందిన 90మంది విద్యార్థులకు ఐడీ కార్డులను అంద జేశామన్నారు. అమ్మ అదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వనిత పాల్గొన్నారు.

## లక్కోరలో జేఏఎస్ ఆరోగ్య సమితి సమావేశం

వేల్పూర్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కోర గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం జేఏఎస్ ఆరోగ్య సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ 30 ఏళ్లు పైబడిన వారికి లక్కోర ప్రభుత్వ ఆసుపత్రిలో బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ విజయ్‌కుమార్, పల్లె దవాఖానా ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ శ్రావణి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

## పిప్రిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో శనివారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల పశుసంవర్ధక శాఖ అధికారి లక్కం ప్రభాకర్, పశువైద్యాధికారిణి శైలజలు పాడి పశువు పెంపకం దారులకు, రైతులకు పలు సూచనలు చేశారు.

## వైన్స్‌లు నిబంధనలు పాటించడం లేదని సీఐకి వినతి



అబ్కారీ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

దోమకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీబీపేట రోడ్డులో గల సాయివైన్స్, శ్రీ నవదుర్గ వైన్స్ యజమానులు నిబంధనలు పాటించడం లేదని శనివారం దోమకొండ గ్రామస్థులు అబ్కారీ సీఐకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ దోమకొండ గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి వృత్తి, వ్యాపార అనుమతులు తీసుకోకుండానే మద్యం వ్యాపారం నిర్వహిసున్నారని ఆరోపించారు. పార్కింగ్, పర్మిట్‌రూం ఇతర సౌకర్యాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐ మధుసుధన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై సీఐ మధుసుధన్‌రావును వివరణ కోరగా తమ నిబంధనల ప్రకారం.. అబ్కారీ శాఖ నుంచి లైసెన్స్‌లు ఉన్నాయని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా వైన్స్ యజమాని శనివారం గ్రామపంచాయతీ నుంచి ట్రేడ్‌లైసెన్స్ తీసుకున్నట్లు తెలిసింది.

## భక్తులతో కిలకిటలాడిన లింబాద్రిగుట్ట

భీమ్‌గల్‌రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మండలంలోని లింబాద్రిగుట్టపై శనివారం గోవిందా నామ స్మరణలతో భక్తులతో కిటకిటలాండింది. భక్తులు దైవదర్శనం కోసం బారులు తీరారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులే కాకుండా దూరప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. దైవదర్శనం కోసం గంట తరబడి నిలబడి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం అన్నదాన కమిటీ నిర్వహించిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.



లింబాద్రిగుట్టపై స్వామివారి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

# అంగన్‌వాడీలో గ్రామ పంచాయతీ

- ఒక వైపు అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ...
- మరో వైపు అదే కేంద్రంలో గ్రామ కార్యదర్శి విధులు
- సొంత భవనం లేక ఇబ్బందులు





గ్రామ పంచాయతీ కార్యాలయం కొనసాగుతున్న పులిగుండు తండా గ్రామ అంగన్‌వాడీ కేంద్రం

బాన్సువాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా ప్రజలు నేరుగా గ్రామపంచాయతీ కార్యదర్శికి వెళ్లి మొరపెట్టుకుంటారు. కాని ఇక్కడ గ్రామపంచాయతీ కార్యాలయమే సమస్యగా మారింది. బాన్సువాడ మండలం పులిగుండు తండా గ్రామపంచాయతీలో గ్రామపంచాయతీ భవనంలేక అంగన్‌వాడీ కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులు నిర్వహిస్తున్నారు. కొన్నిరోజుల క్రితం గ్రామంలో పాత అద్దె భవనం ఉండగా, దాన్ని తొలగించారు. దీంతో గ్రామ పంచాయతీ భవనాన్ని అంగన్ వాడీ కేంద్రంలోకి మార్చారు. ఇటు పిల్లలు, గర్భిణులు ఎక్కడ కూర్చోవాలో తెలియక అవస్థలు పడుతున్నారని గ్రామప్రజలు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ సమయంలో పిల్లలు, గర్భిణులు వచ్చి నప్పు డు వారికి భోజనం వండిపెట్టే సమయంలో గ్రామ పం చాయతీ కార్యదర్శి ప్రజలు కేం ద్రంలో ఉండ డంతో విధి నిర్వ హణలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, అటు అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులు ఇటు గ్రామ పంచాయతీ కార్యదర్శి అంటున్నారు.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామపంచాయతీ కార్యాలయాన్ని నూతనంగా ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకురావాలని లేనియేడల మరో భవనంలోకి మార్చి అంగన్‌వాడీ నిర్వహణకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులకు అటంకం కలుగకుండా ప్రత్యేక భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

# వర్షానికి తడుస్తున్న ధాన్యం.. ఆందోళనలో రైతులు



కోటగిరి, పోతంగల్ రహదారిపై తడిసిన ధాన్యం

కోటగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో పంటలు చేతికొచ్చిన సమయానికి వర్షాలు పడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోటగిరి, పోతంగల్ మండలాల్లో శనివారం వర్షం కురియడంతో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారం రోజుల నుంచి ముమ్మరంగా వరికోతలు ప్రారంభం కాగా ధాన్యాన్ని రహదారులపై రైతులు ఆరబెడుతున్నారు. వర్షం పడుతుండడంతో ఆరబెట్టిన ధాన్యం తడుస్తోంది. టార్పాలిన్‌లు, పట్టాలకోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షం వచ్చే సమయానికి ఆరబెట్టిన ధాన్యాన్ని ఒక చోటుకు చేర్చేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ధాన్యం కొనుగోలు చేయకపోవడం రైతులను తీవ్ర నిరాశకు గురి చేస్తుంది. ఇదే అదనుగా దళారులు ధాన్యం తరలించుకుపోతున్నారు. అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో దళారులు ధాన్యం ధరను తగ్గిస్తూ కొనుగోలు చేస్తుండడంతో రైతులు మరింత నష్టపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

## మధ్యాహ్న భోజనంలో పురుగులు



మధ్యాహ్న భోజనంలో పురుగుల అన్నం

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినిలకు అన్నంలో పురుగులు వచ్చినట్టు తెలిసింది. శనివారం పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించగా విద్యార్థినులు తినే అన్నంలో పురుగులు ఉన్న అన్నంను చూశారు. దీంతో మధ్యాహ్నభోజన నిర్వాహకురాలిని నిలదీయడంతో ప్రభుత్వం తరపున రావల్సిన బకాయిలు చాలా ఉన్నాయని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చింది. దీంతో పిల్లల తల్లిదండ్రులు, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్టు తెలిసింది.. గత కొద్దిరోజులుగా ఇలాంటి సంఘటనలు చాలా సార్లు పునరావృతం అయిందని, మెను ప్రకారం విద్యార్థినిలకు భోజనాన్ని అందించడంలేదని, దీంతో పలువురు విద్యార్థినులు ఇంటి నుంచి టిఫిన్ తీసుకువచ్చి మధ్యాహ్న భోజనం చేస్తున్నారని తెలిసింది. గతంలో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై ఫిర్యాదులు వచ్చినా అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

# దాడులపై వీహెచ్‌పీ నిరసన



వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

బోధన్‌రూరల్,అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): హిందు దేవి, దేవతల విగ్రహాల ధ్వంసం, హిందువుల ఆధ్యాత్మిక ఊరేగింపులపై దాడులను నిరసిస్తూ శనివారం బోధన్‌లో విశ్వ హిందు పరిషత్ ఆధ్వర్యంలో హిందు సంఘాల నాయకులు నిరసన ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వెళ్లి హిందు సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. హిందు దేవాలయాలపై దాడులు చేయడం సరికాదని, మరోమారు దాడులు జరుగకుండా పకడ్బంది చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్ నాయకులు ప్రవీణ్ తాడూరి, రామ కోటేశ్వర శర్మ, సురేష్ ఇనాని, శివ, స్వప్నిల్, శంకర్, సాయినాథ్, తదితరులున్నారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయం వద్ద హిందువులపై లాఠీచార్జీ అమానుషమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన బోధన్‌లో మాట్లాడుతూ సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో ఇటీవల అమ్మవారి గుడిపైన దాడి చేసి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని స్థానిక హిందు సంఘాల ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న హిందువులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

**ఆర్మూర్‌రూరల్:** హిందు దేవాలయాలపై దాడులకు పాల్పడిన వారిపై కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్‌కు విశ్వహిందు పరిషత్ భజరంగ్‌దల్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. కొన్నిరోజులుగా జరుగుతున్న దాడులకు నిరసనగా వారు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు.

**కామారెడ్డిటౌన్:** రాష్ట్రంలో రోజురోజుకు హిందూ దేవాలయాలపై దాడులు పెరిగిపోతున్నాయని వాటిని అదుపు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోందని విశ్వహిందూపరిషత్, బంజరంగ్‌దళ్ నాయకులు అన్నారు. శనివారం నిజాంసాగర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేసి కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు బ్యాంకు రాజకీయాలకు కక్కుర్తి పడి పట్టించుకోవడం లేదని అన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు గంగారెడ్డి, వల్లిరాజు, శ్రీకాంత్, బజరంగ్‌దళ్ నాయకులు వివేకానంద,అశోక్, జిల్లా గోరక్ష ప్రముఖ తులసి, వినోద్, మంచాల రాజు,వంగప్రసాద్ పాల్గొన్నారు.

# రైతులకు అన్యాయం చేయవద్దు : బీఆర్‌ఎస్



కమ్మర్‌పల్లిలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాదికి రైతుభరోసా ఇవ్వలేమని వ్యవసాయశాఖ మంత్రి అనడం సరికాదని శనివారం మండల బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ, మంత్రి తుమ్మలనాగేశ్వరరావు దిష్టిబొమ్మను మండలకేంద్రలోని జాతీయరహదారిపై హసాకొత్తూర్ చౌరస్తా వద్ద దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఫైలారం సుధాకర్, గ్రామశాఖ అధ్యక్షుడు కేకే నరేందర్, కొత్తపల్లి రఘు, కిరీటి, నరేందర్ పాల్గొన్నారు.

**నందిపేట:** మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదుట శనివారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆశన్నగారి జీవన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను నాయకులు దహనం చేశారు. మండల పార్టీ అధ్యక్షులు మచ్చర్ల సాగర్, మాజీ కోఆప్షన్ సభ్యులు హుస్సేన్ ఉన్నారు.

**వేల్పూర్ :** మండల కేంద్రంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహ నం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జైడి నాగాధర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మోహన్‌రెడ్డి, మోతె రాజేశ్వర్, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

**ఏర్గట్ల:** ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి, బద్దం ప్రభాకర్, మారు నరేష్, శ్రీనివాస్ రెడ్డి, జైనోద్దీన్, పోచయ్య పాల్గొన్నారు.

**ఆర్మూర్‌టౌన్ :** పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొ మ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులతో చెల గాటం ఆడితే తగిన గుణపాఠం చెబుతా రని తెలిపారు.

**భీమ్‌గల్:** కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య అన్నారు. శనివారం పట్టణంలోని చౌరస్తా వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.





## దారిదోపిడీ ముఠా కోసం పోలీసుల గాలింపు

నవీపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాపూర్, ఫకీరాబాద్, నాగేపూర్‌లలో శుక్రవారం తెల్లవారుజామున దారిదోపిడీకి పాల్పడిన ముగ్గురు దుండగుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నెంబర్‌ప్లేట్ లేని పల్సర్ బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు మండలంలోని మిట్టాపూర్, ఫకీరాబాద్, నాగేపూర్‌లలో పలువురిని కత్తితో బెదిరించి దాడి చేయడంతో పాటు వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు, కొంత నగదును ఎత్తుకెళ్లిన విషయం విదితమే. ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకున్న పోలీసులు ప్రత్యేక బృందంతో దుండగుల కోసం గాలింపు చేపట్టినట్లు తెలుస్తోంది.

## బాలిక అదృశ్యం

ఎడపల్లి, అక్టో బరు 19 (ఆం ధ్రజ్యోతి) : మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామానికి చెందిన గీకురు రమ్యశ్రీ అనే యువతి అదృశ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఏఆర్పీ గ్రామానికి చెందిన గీకురు రమ్యశ్రీ (15) అనే యువతి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుందన్నారు. రోజులాగే కాలేజీకి వెలుతున్నా అని ఇంట్లో చెప్పి శనివారం ఉదయం వెళ్ళిన బాలిక సాయంత్రం వరకు తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల దగ్గర వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి గీకురు శ్రీనివాస్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యా దు చేసినట్లు ఆయన తెలిపారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## రామన్నపేట్ పాఠశాలలో కంప్యూటర్ గది ప్రారంభం

వేల్పూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ గదిని శనివారం మండల విద్యాశాఖ అధికారి రేణుక ప్రారంభించారు. హైదరాబాద్‌లో స్థిరపడిన రామన్నపేట్ వాసి జెట్టి మల్లేష్ పాఠశాలకు సుమారు రూ.50వేల విలువ గల కంప్యూటర్‌తో పాటు ఇతర సౌకర్యాలను కల్పించారు. కార్యక్రమంలో వేల్పూర్ కాం ప్లెక్స్ స్కూల్ హెచ్‌ఎం రాజన్న, ప్రధానోపాధ్యాయులు శివాజీ. నరేందర్, ఎఎపీసీ చైర్మన్ జె.సునిత, గుమ్ముల గంగాధర్ పాల్గొన్నారు.

## క్షత్రియ పాఠశాలలో అమరజవాన్‌ల సంస్మరణ సభ



సన్మానిస్తున్న క్షత్రీయ పాఠశాల యాజమాన్యం

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చేపూర్‌లో గల క్షత్రియ పాఠశాలలో శనివారం వీర్‌గాథా 4.0 అమర్‌జవాన్‌ల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని సుబేదార్ అనుజ్ రాజా హవల్‌ధార్ టీం మహేంద్ర జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైనికుల సేవల ను, తమ అనుభవాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో క్షత్రీయ విద్యాసంస్థల కరస్పాండెంట్ అల్జాపూర్ దేవేందర్, కోశాధికారి అల్జాపూర్ గంగాధర్, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సింహస్వామి పాల్గొన్నారు.

## ఈటెల రాజేందర్‌ను కలిసిన ముదిరాజ్ సంఘసభ్యులు



నియమక పత్రాన్ని అందజేస్తున్న మాల్కాజిగిరి ఎంపీ ఈటెల

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ను శనివారం ఆర్మూర్ ముదిరాజ్ సంఘ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలో పలు కార్యక్రమాలకు విచ్చేసిన ఆయనను ముదిరాజ్ సంఘ సభ్యులు కలిసి తెలంగాణ ముదిరాజ్ మహాసభ యూత్ విభాగం అధ్యక్షునిగా మందుల బాలును ముదిరాజ్ సంఘం జిల్లా కార్యదర్శిగా మందుల పోశెట్టిలను నియమిస్తూ నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగ్ ముదిరాజ్ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాఠశాలను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని కస్తూర్బా పాఠశాల, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. పాఠశాలలోని వంటశాల గదులను విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని ఆయన పరిశీలించారు. పాఠశాల ఆవరణలో శుభ్రంగా ఉంచుకోవాలని, హెల్త్‌క్యాంప్‌లు నిర్వహించాలని పాఠశాల ప్రిన్సిపాళ్ళకు సూచించారు. ఆయన వెంట సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజనీర్ పూర్ణమౌళి, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తాం : ఎంఈవో

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తామని మండల విద్యాధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. శనివారం పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య పెరిగేలా కృషి చేస్తున్నానని తెలిపారు.

## విద్యార్థులకు బహుమతుల అందజేత

కామారెడ్డిటౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌ను నిర్వహించారు. కృత్రిమ మేధస్సు దానిఉపయోగాలు, అనర్థాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించగా ఇందులో 34 పాఠశాలలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా డీఈవో రాజు మాట్లాడుతూ జడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ కామారెడ్డి పాఠశాల విద్యార్థిని ఎస్‌కే. సనా మొదటి బహుమతి సాధించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు.

## విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనుకావద్దు : ఎస్సై

సదాశివనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుకునే వయస్సులో ఎలాంటి మానసిక ఒత్తిళ్లకు గురికాకుండా ప్రశాంతంగా చదువుకుంటేనే అనుకున్న లక్ష్యం సాధించగలుగుతారని ఎస్సై రంజిత్ తెలిపారు. మండలంలోని భూంపల్లి ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాలు వాటి నియంత్రణ, సైబర్ క్రైం, పిల్లలలో మానసిక ఒత్తిడి మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకేశ్వర్, అమ్మఆదర్శపాఠశాల చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్, లింగం, ముతెన్న పాల్గొన్నారు.

## మొగిలి చెరువు సర్వే చేయాలి : అదనపు కలెక్టర్



చెరువు కట్టను పరిశీలిస్తున్న అధికారులు

భీమ్‌గల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని కసూర్బా రోడ్డులో గల మొగిలి చెరువును సర్వే చేపట్టాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఇరిగేషన్ రెవెన్యూ మున్సిపల్ అధికారులతో కలిసి మొగిలిచెరువును, ఇటీవల తెగిన చెరువు కట్టను పరిశీలించారు. వర్షాలు కురిసినప్పుడు అయ్యప్పనగర్ మొత్తం నీటితో నిండిపోతుందని, దీంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని మండల అధికారులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

## వేర్వేరు కారణాలతో ఇరువురి ఆత్మహత్య

లింగంపేట, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన దొడ్లె దాసుగౌడ్ (53) ఛాతి నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని కుమారుడు విశాల్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపతున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. దాసుగౌడ్‌కు ఆరేళ్ల క్రితం స్టంట్ వేశారు. అయినప్పటికీ ఛాతినొప్పితో బాధపడు తున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు. శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వారు తెలిపారు. ఛాతిలో నొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసిటనట్లు ఎస్సై తెలిపారు. మండల కేంద్రానికి చెందిన జినగరి రాజు (51) చెడు వ్యసనాలకు బానిసగా మారి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు. రాజు చెడు వ్యసనాలకు బానిసగా మారడంతో అప్పులు పెరిగాయన్నారు. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి ఇంటి వద్ద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

ఎడపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకంపేట గ్రామ శివారులోని సీటీసీ ఎదుట గల రథం చెరువులో మహిళ శవం లభించినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జానకంపేట గ్రామ శివారులోని సీటీసీ ఎదుట గల చెరు వులో దాదాపు 55 నుంచి 60 సంవత్సరాల వయసు గల మహిళ శవం ఉందన్నారు. గ్రామస్థులు తెలపగా సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



నాసిరకంగా ఉన్న ఆహారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

### జిల్లాకేంద్రంలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ అధికారుల

# ఆకస్మిక తనిఖీలు

- పలు హోటళ్లకు నోటీసులు జారీ

సుభాష్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లాకేంద్రంలోని పలు హోటళ్లపై దాడులు నిర్వహించారు. రాష్ట్ర ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీమ్ హెడ్‌జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. మొదటగా లహరి, వంశీ ఇంటర్నేషనల్ హోటళ్లపై తనిఖీలు నిర్వహించి నోటీసులు జారీచేశారు. లహరి హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాల ప్రకారం సరైన ఉష్ణోగ్రతను మెయింటేన్ చేయకపోవడమే కాకుండా ఫుడ్ గ్రేడ్ లేని ప్లాస్టిక్ కవర్‌లలో సుమారు 122 కేజీలు, రూ. 30వేల విలువగల కుళ్లిన మాంసపు ఉత్పత్తులను, హానికర ప్రమాదకరమైన రంగులు కలిపిన చికెన్‌ను, మసాలాపేస్ట్‌లను సీజ్ చేశారు. హోటల్ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వంశీ ఇంటర్‌నేషనల్‌లో 24వేల విలువగల ఫ్రిడ్జ్‌లో నిలువ ఉంచిన మాసంపు ఉత్పత్తులను, మిర్చీ పేస్ట్, కాలం చెల్లిన మసాలా పొడిలను ధ్వంసం చేశారు. అపరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేస్తున్న యాజమాన్యంపై తీవ్రంగా మండిపడ్డారు. రెండు హోటళ్లకు నోటీసులు జారీ చేసి అనుమానాస్పద సాంపిళ్లను సేకరించారు. అనంతరం డిల్లీవాలా స్వీట్ హోమ్‌పై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్కడ ఉన్న పరిస్థితులను అపరిశుభ్రత వాతావరణం చూసి హోటల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమానాస్పద వస్తువులను సేకరించి ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఆహార తయారీ దారులు అమ్మేవారు ఎంతటివారైనా సురక్షితమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని హెచ్చరించారు. లేనియెడల హోటల్ యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈదాడుల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, స్వాతి, శిర్షిక పాల్గొన్నారు.



నోటీసులు అందజేస్తున్న అధికారులు




ఎల్డి సుదర్శన్ వెలువరించిన పుస్తకాలు

# ముంబాయిలో తెలుగు సౌరభాలు

- సాహిత్యంలో కవి ఎల్డి సుదర్శన్ ఎనలేని సేవలు
- మోర్తాడ్ నుంచి మరత్వాడ వరకు ప్రస్థానం



మోర్తాడ్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ గ్రామం నుంచి ప్రముఖ కవిగా ఎదిగారు ఎల్డి సుదర్శన్. వ్యాపార రీత్య ఆయన ముంబాయిలో స్థిరపడ్డారు. సమాజాన్ని సున్నితంగా పరిశీలిస్తూ సునిశితంగా శోధిస్తూ మనస్సులో సందడిచేసే భావలకు సాహిత్యాన్ని జోడిస్తూ రచనలు చేస్తున్నారు. ఎన్నో సాంస్కృతిక సాహిత్య రంగాలలో పాల్గొని ప్రముఖుల మన్ననాలు పొందుతున్నారు. మోర్తాడ్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగునేర్పిన గురువు శతవధాని డాక్టర్ అందె వెంకటరాజం సహచర్యంలో కవిగా తొలిఅడుగులు వేశారు. మహాకవి సి.నారాయణరెడ్డిని గురువుగా స్వీకరించి దినదిన ప్రవర్థమానంగా తన సాహిత్ వనంలో కవితగానం చేస్తున్నారు.



ఎల్డి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జ్ఞానపీఠ అవార్డు గ్రహీత సి.నారాయణరెడ్డి (ఫైల్)

- ప్రచురితమైన ఎల్డి పుస్తకాలు

ఎల్డి సుదర్శన్ ఇప్పటివరకు పది పుస్తకాలు వెలువరించారు. ఉద య కిరణాలు, ఎల్డి ముత్యాలు, ఎల్డి కవిత, ఎల్డి రత్నలు, కలిన హృ దయాలు, ఎల్డి పగడలు, గుడచరి వదిన(నవల), ఎల్డి వైడుర్యాలు, ఎల్డి మాణిక్యాలు, మాదవి ఐపీఎస్(దేశభక్తి నవల) లాంటి కవితల నవలాలను వెలువరించారు. అంతే గాక ప్రేమంజలి నవల, కరోనా లో మనం కవిత సంపుటిలు ప్రచురణలో ఉన్నాయి.

- సత్కారాలు.. పురస్కారాలు

ఎల్డి సుదర్శన్ పలు సాహితి సంస్థల నుంచి పురస్కారాలు, సత్కరాలు పొందారు. పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి కీర్తి పురస్కారం, త్యాగరాయ గణసభలో సాంస్కృతి సంఘాల సన్మానం తోపాటు ప్రతిష్ఠాత్మక ప్రజారత్న అవార్డును పొందారు. కిన్నెర సంస్థ వారి ఉగాది పురస్కారం (2010) పొందారు. రవీంద్రభారతి సాంస్కృతిక సాహిత్య ప్రవాసంధ్రా అవార్డును అందుకున్నారు. డాక్టర్ సి. నారాయణరెడ్డి కళాభవన్ వారి సన్మానం కూడా పొందారు మహారాష్ట్రలో నాగ్‌పూర్ జాగృతికిరణ్ ఆధ్వర్యంలో కర్ణటక గవర్నర్ టిఎన్. చతుర్వేది, మహరాష్ట్ర గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు, 2006లో నేతాజి కల్చరల్ అవార్డును అప్పటి కేంద్ర మంత్రి దత్తాత్రేయ చేతుల మీదుగా అందుకున్నారు. అప్పటి .అధికార బాష సంఘం అధ్యక్షుడు ఏబీకె.ప్రసాద్, సిక్కిం గవర్నర్ రామారావు, ప్రస్తుత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో సన్మానాలు పొందారు. నిజామాబాద్ జిల్లాలో ఇందూరు అపురూప అవార్డును, గాంధీ విచార్ మంచ్ వారి పురస్కారంతో పాటు మరెన్నో సంస్థల నుంచి పురస్కారాలు, సన్మానాలు అందుకున్నారు.

నయా ట్రెండ్

# ఎలక్ట్రిక్ జోష్



- కాలుష్య రహితం.. ఖర్చు మితం
- తగ్గిన ఇంధన వెతలు
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు
- ఆసక్తి చూపుతున్న వాహనదారులు

కోటగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉరుకుల పరుగుల జీవన గమనంలో త్వరగా గమ్యం చేరేందుకు ప్రతి ఒక్కరు వ్యక్తిగత వాహనాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో వాటి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అదే క్రమంలో ఇంధన ధరలు అంతకంతకు పెరుగుతూ పోతున్నాయి. ఈ నేపథ్యంలో మిగులు బడ్జెట్ కోసం వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇంధనం ఖర్చు లేకపోవడం, జీరో మెంటనెన్స్ కారణంగా చాలా మంది వీటి వైపు మొగ్గు చూపుతున్నారు, రోజురోజుకుకాలుష్యం పెరిగి పోతుండడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ ఆధారిత వాహనాల కొనుగోలును, వినియోగాన్ని ప్రోతహిస్తున్నాయి. సాధారణ కార్లు, బైక్‌లు, స్కూటీలతో పోలిస్తే తక్కువ ఖర్చు అవుతుందని సౌకర్యంగానూ ఉందని వినియోగదారులు చెబుతున్నారు. పెట్రోల్, సర్వీసింగ్ ఖర్చులు మిగులుతున్నాయి. ఒక్కోసారి చార్జింగ్ చేస్తే చాలు 100కిలోమీటర్ల మేరకు వెళ్లే అవకాశం ఉండడంతో ఈ బైక్‌లు, ఈకార్లపై రైయ్‌మంటూ దూసుకెళ్తున్నారు.

జిల్లాలో ఎలక్ట్రిక్ వాహనాలు రోడ్లపై రైయ్ మంటూ చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం సామాన్య, మధ్యతరగతి ప్రజలు సైతం ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తుండడంతో ఈ వాహనాల సంఖ్య పెరుగుతోంది. ఒకసారి కొనుగోలు చేసిన వాహనం రెండు, మూడేళ్ల వరకు ఎలాంటి సర్వీసింగ్ అవసరం లేదు. ఇంధన భారం లేకుండా నడిచే వాహనాలు కావడంతో వాహనదారులు ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలో హీరో హోండా, బజాజ్, టీవీఎస్ లాంటి షో రూమ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఏడేళ్ల క్రితమే ఎలక్ట్రిక్ వాహనాలు మార్కెట్‌లోకి వచ్చిన ఆశించిన స్థాయిలో మార్కెట్‌లో అమ్మకాలు జరుగలేదు. గత రెండేళ్ల నుండి జిల్లాలో ఎలక్ట్రిక్ బైక్‌ల అమ్మకాల జోరు అందుతుంది. టీవీఎస్ కంపెనీ సైతం ఎలక్ట్రిక్ వాహనాలు తయారు చేయడంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ వాహనాల అమ్మకాలు కొనసాగుతున్నాయి. షోరూమ్‌లో ప్రతి నెల విక్రయించే ద్విచక్ర వాహనాలలో అధిక శాతం ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు జరుగుతున్నాయి.

- ఎలక్ట్రిక్ బైక్ అంటేనే జీరో మెంటెనెన్స్

ఎలక్ట్రిక్ బైక్ అంటేనే జీరో మెంటనెన్స్ కావడంతో ఎక్కువమంది ఈ వాహనాల కొనుగోలుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎలక్ట్రిక్ బైక్‌లను నెలవారి వాయిదాలపై కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసేటప్పుడు మాత్రమే పెట్టుబడి తప్పసర్వీసింగ్ అవసరం లేదు. జిల్లాలో 2వేలకు పైగా వాహనాలు ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నట్లు అంచన. ఓలా కంపెనీ బైక్‌లు అ[illegible]త్తంలో అమ్ముడుపోతున్నాయి.

- టెక్నీషియన్‌లు లేక ఇబ్బందులు

ఎలక్ట్రికల్ వాహనాలకు టెక్నీషియన్‌లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మరమ్మతులకు గురైన వాహనాన్ని హైదరాబాద్‌లోనే రిపేర్ చేయించాలి. అందుకు వాహనాన్ని ట్రాన్స్‌పోర్టు ద్వారా తరలించాల్సి వస్తుంది. ట్రాన్స్‌పోర్టులో తరలించే సమయంలో డామేజ్‌తో పాటు ఆర్థిక భారం పడుతోంది. రిపేర్ చేసేందుకు 500రూపాయలు ఖర్చు అవుతుంటే రవాణాకే 5వేల రూపాయలు ఖర్చు అవుతుంది. టెక్నిషియన్‌లను అందుబాటులో ఉంచితే ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు మరింత జోరందుకోనున్నాయి.



### సెల్‌ఫోన్‌తో ఆన్, ఆఫ్

- పోల అశ్విన్ సెట్, కోటగిరి



ఓలా ఎలక్ట్రికల్ స్కూటీని కొనుగోలు చేసి ఏడాది అవుతుంది. ఒక్కసారి ఇంట్లో విద్యుత్ చార్జింగ్ చేస్తే వంద కిలో మీటర్ల వరకు ప్రయాణం చేయవచ్చు. ఏడాదిలో 14వేల వరకు ఇంధన ఖర్చు తగ్గింది. ఈ వాహనాలకు బ్లూటుత్ సిస్టం ఉండడంతో సెల్‌ఫోన్ ద్వారానే వాహనాన్ని ఆన్, ఆఫ్ చేసుకునే అవకాశం ఉంది.

### డబ్బు ఎంతో ఆదా

- గంగారాం, మాజీ సర్పంచ్, కోటగిరి

ఎలక్ట్రిక్ స్కూటీతో సౌకర్యవంతంగా ప్రయాణించవచ్చు. జీరో మెంటెనెన్స్ కలిసి వస్తుంది. గతంలో బైక్ మెంటనెన్స్‌కు నెలకు 6వేలకు పైగా ఖర్చు అయ్యేది. ఆరు నెలల క్రితం టీవీఎస్ బైక్‌ను కొనుగోలు చేశా. ప్రతీనెల విద్యుత్ యూనిట్ కోసం 500లోపు ఖర్చు అవుతోంది. ఈబైక్‌తో డబ్బు ఆదాతోపాటు పర్యావరణానికి మేలు చేకూరుతుంది.

### ఆర్‌సీ సైతం అవసరమే లేదు

- గంగాధర్, మాజీ ఏఎంసీ చైర్మన్, హంగర్గ

ఎలక్ట్రిక్ వాహనానికి ఆర్‌సీ సైతం అవసరం లేదు. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం 200యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో వాహనానికి కూడా సరిపోతుంది. వంద కిలో మీటర్లు ప్రయాణించే అవకాశం ఉండటంతో మండల కేంద్రంతో పాటు డివిజన్, జిల్లా కేంద్రానికి ఖర్చు లేకుండా వెళ్లి వచ్చే ఉంది.



# కుంగిన వంతెన అప్రోచ్ పిల్లర్లు

- ఆరేళ్లకే హైలెవల్ వంతెన జాయింటింగ్‌ల వద్ద బీటలు
- నిర్మాణాల్లో నాణ్యతా లోపం
- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రజలు




వంతెన అప్రొచ్ వద్ద మరమ్మతులు చేసిన దృశ్యం

నిజాంసాగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన మంజీరా వంతెనకు నాణ్యత లోపించింది. నిర్మాణం చేపట్టి అరేళ్లు గడిచినప్పటికీ మున్నాలకే బీటలు పడటం గమనార్హం. నిజాంసాగర్ మండల కేంద్రానికి ఆమడ దూరంలో మంజీరా నది పైన 25 కోట్ల రూపాయల వ్యయంతో 2016 నుంచి 2022 వరకు వంతెన నిర్మాణం చేపట్టారు. కాని వంతెన నిర్మాణంలో నాణ్యత లోపించడంతో వంతెన జాయింట్లు వద్ద బీటలు వారాయి. వంతెన అప్రోచ్ పిల్లర్ల వద్ద మున్నాళ్లకే రోడ్డు కుంగిపోయింది. దీంతో రాకపోకలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వంతెనపై నుంచి వెళ్లాల్సి వచ్చింది. రోడ్డు భవనాలశాఖ అధికారులు రెండు నెలల క్రితం కృంగిపోయిన అప్రోచ్‌ల వద్ద తవ్వకాలు చేపట్టివెయిట్ మిక్స్‌తో ఫిల్లింగ్ చేశారు. కానీ ఆ ప్రాణం పిల్లర్ల వద్ద చేపడుతున్న మరమ్మతులు కొనసాగుతున్నప్పటికీ పనులు నత్తనడకన కొనసాగుతూ ఉండటంతో ఈ వంతెనపై నుంచి వెళ్లే వాహనాలు అనేక పాట్లు పడుతూనే ఉన్నారు. వంతెనకు ఒక వైపు మరమ్మతులు చేపట్టారు. మరోవైపు మరమ్మతులు చేపట్టడంలో కాలయాపనలు జరుగుతూనే ఉంది. ఈ రహదారి ఇరుకుగా ఉండటంతో అనేక ఇబ్బందులు ఏర్పడుతున్న రోడ్డు భవనాల శాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరేళ్లకే మంజీరా వంతెన బీటలు పడటం ప్రధాన కారణం. నాణ్యత లోపాలు అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పది కాలాల పాటు నిర్వాహణ చేయాల్సిన పనికి కాంట్రాక్టర్ రోడ్డు భవనాల శాఖ అధికారులతో కుమ్మక్కై వంతెన నిర్మాణం చేయడం లేదని తెలుస్తుంది. వంతెన జాయింట్ల వద్ద బీటలు పడుతున్న అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తూ ఉండటం విశేషం. రెండు రాష్ట్రాలకు వారధి అయినా మంజీరా వంతెనపై అధికారులు ప్రత్యేక శ్రద్ధచూపి పనులు సకాలంలో పూర్తి చేయాలని మండల వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి పరిశీలన



అయిపోయిన వంతెన రోడ్డుకు తవ్వకాలు చేస్తున్న దృశ్యం



కుంగిపోయిన రోడ్డుకు వెయిట్ మిక్స్ వేసిన దృశ్యం

జరదేఖో!!




పాత భవనానికి కొత్త పేరు బోర్డు ఇదే..

ఊడిన భవనం పెచ్చులు

# శిథిలావస్థలో ఆయుష్మాన్, యునాని వైద్యశాల భవనం

- ఆయుష్మాన్, యునాని వైద్యశాల పేరుకేనా?

మోస్రా, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆయుష్మాన్ యునాని వైద్యశాలలో సమస్యలు తిష్టి వేశాయి. యునాని ఆయుష్మాన్ వైద్యశాల వైద్య అధికారి సబూర్ తెలిపిన వివరాల ప్రకారం ఇక్కడ పూర్తిస్థాయి సిబ్బంది లేరు. ఉన్న సిబ్బందికి వసతులు కరువు. మహిళా సిబ్బంది కావడంతో మరుగుదొడ్లు లేక మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సిబ్బంది ఇబ్బంది ఇందులో ఒక ఫార్మాసిస్టు, నర్సింగ్ ఆఫీసర్, పీటీఎస్‌లు ఉండాలి. కానీ ఇక్కడ అందరు డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు వారానికి కేవలం మూడు రోజులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఈ వైద్యశాలలో ప్రధాన సమస్యగా ప్రతీ పని ఆన్‌లైన్ పనిచేయాలి. ఇక్కడ విద్యుత్ సదుపాయం లేదు. ట్యాబ్, ఫోన్ చార్జింగ్ పెట్టడం కష్టంగా ఉంది. పాత భవనానికి కొత్త పూతలాగా కొత్తగా పేరు మాత్రమే రాశారు లోపల అంత శిథిలావస్థలో ఉన్న భవనం చిన్నవర్షానికే పైనుండి పెచ్చులు ఊడి పడడం, లోపలికి వర్షపు నీరు పడటంతో వైద్యం కోసం వచ్చే వారికి అందుబాటులో ఉండే ఔషధాలు, లెహ్యాము, ముఖబా మునఫీ, పలు రకాల రోగాలకు సంబంధిత మాత్రలు నీళ్లలో తడిసి పాడవుతున్నాయి. సంబంధిత అధికారులు విచారణ చేసి నూతన భవనం ఏర్పాటుచేసి రెగ్యులర్‌గా విధులు నిర్వహించే సిబ్బందిని ఏర్పాటు చేయాలని యునాని వైద్య అధికారి సుబూర్ తెలిపారు.

# అడ్డగోలుగా మెడికల్ దందా!

- ఔషధ దుకాణాల్లో నిబంధనలకు పాతర
- కానరాని ఫార్మాసిస్టులు
- బినామీల పేర్లతో నిర్వహణ
- అమాయకుల ప్రాణాలతో చెలగాటం
- ధనార్జనే ధ్యేయంగా దందా
- వైద్యుల చీటీ లేకుండానే మందుల విక్రయం
- ఇంత జరుగుతున్నా ఔషధ నియంత్రణ అధికారుల తనిఖీలు కరువు

ఆంధ్రజ్యోతి ఫోకస్



బాన్సువాడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్ని వ్యాపారాల్లోకెల్లా మెడికల్ వ్యాపారమే లాభసాటిగా భావిస్తున్న కొందరు ధనార్జనే ధ్యేయంగా మందులపై వ్యాపారం చేస్తున్నారు. వృత్తిపట్ల ఎటువంటి అవగాహన లేకున్నా కొందరు మెడికల్ దుకాణాలను ఏర్పాటుచేసి వ్యాపారం సాగిస్తున్నారు. జిల్లాలో మెడికల్ దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. 'మెడికల్ పెట్టుకో.. డబులు దండుకో' అన్నచందంగా తయారైంది మెడికల్ వ్యాపారుల తీరు. అమాయక ప్రజల ఆరోగ్యంతో ఔషధ దుకాణాదారులు ఆటలాడుకుంటున్నారు. వైద్యులతో ఒప్పందాలు కుదుర్చుకుని రెండుచేతుల్లా సంపాదిస్తున్నారు. జ్వరాలు వచ్చి వైద్యుల వద్దకు వెళ్తే 10 రకాల మందులురాసి అమాయకుల నడ్డి విరుస్తున్నారు. ప్రజలు వైద్యులు, మెడికల్ యజమానుల దెబ్బకు కుదేళ్లవుతున్నారు.

### పుట్టగొడుగుల్లా మెడికల్ దుకాణాలు

కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో గ్రామాగ్రామాన మెడికల్ షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిభందనలకు పాతరేసి మెడికల్ షాపులను బినామీలు నడుపుతున్నారు. నకిలీ మందులు అంటకట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇది వైద్యులు, మెడికల్ యజమానులు కలసి ఆడుతున్న ప్రాణాంతక ఆట. ఈ ఆటలో అమాయకులే బలి అవుతుంటే, వైద్యులు, మెడికల్ యజమానులు కోట్లకు పడగలెత్తుతున్నారు. రాష్ట్ర వ్యాప్త ంగా ఈ డ్రగ్ మాఫియా రోజురోజుకూ విజృంభిస్తోంది. నిబంధనల ప్రకారం ఫార్మాసిస్టులే మెడికల్ దుకాణాలను నిర్వహించాల్సి ఉండగా కొంతమంది ఎంతో కొంత డబ్బులను ఫార్మాసిస్టులకు ముట్టజెప్పి వారి పేరు మీద మెడికల్ దుకాణాలను యథేచ్ఛగా నడుపుతున్నారు. డాక్టర్లకు పెద్ద మొత్తంలో నజరానాలు ఇస్తూ మందుల వ్యాపారం చేస్తున్నారు. దీనికితోడు గ్రామాల్లోఉండే ఆర్‌ఎంపీ, పీఎంపీ డాక్టర్లతో సంబంధాలు ఏర్పరుచుకుని నాసిరకమైన మందులను అమాయక ప్రజలకు అంటకడుతున్నారు. ఈ వ్యవహారం జిల్లా అంతటా కొనసాగుతున్నా సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం లేకుండాపోయింది. ఔషధ నియంత్రణ అధికారులు సైతం మెడికల్‌ల అసోసియేషన్‌లతో సంబంధాలను సాగిస్తూ ఇచ్చినకాడికి పుచ్చుకుంటున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి.

### వైద్యులు ప్రిస్కిప్షన్ లేకుండానే మందుల విక్రయాలు

వైద్యుల ప్రిస్కిప్షన్ లేకుండా ఎలాంటి మందులు విక్రయించొద్దనే నిబంధనలు ఉన్నా మెడికల్ దుకాణాదారులు మందులను విక్రయిస్తున్నారు. ప్రభుత్వ గుర్తింపు ఉన్న మందులనుకొన్నింటిని అందుబాటులో ఉంచి, మిగి లిన నాసిరకం మందులను విక్రయిస్తున్నారు. దీంతో ఇటు అమాయక ప్రజ లకు, అటు ప్రభుత్వానికి భారీనష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెడికల్ దుకాణాల్లో విక్రయించే మందులకు బిల్లులు ఇవ్వాల్సి ఉండగా, అవేవి ఇవ్వకుండానే ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. వైద్యులు చీటీ రాసి ఇస్తేనే మందులు విక్రయించాల్సి ఉన్నప్పటికి మెడికల్ దుకాణాదారులు మాత్రం చీటీ లేకుండానే మందులను విక్రయిస్తు ఇష్టారీ తిన వ్యవహస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అంతేకాకుండా కొన్ని మందుల దుకాణాల్లో ఫిజీషియన్ శాంపుల్స్‌ను కూడా అమ్ముకుంటూ వ్యా పారులు సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఇంత తతాంగం జరుగు తున్నా ఔషధ నియంత్రణ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చే పడుతారే తప్ప పక్కాగా చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారు. మెడికల్ అసోసియేషన్‌తో ఔషధ నియంత్రణ అధికారులు కుమ్మక్కై కాసులకు కక్కుర్తి పడుతున్నారనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ప్రతీనెల ఔషధ నియంత్రణ అధికారులు జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో నామమాత్రపు తనిఖీలు చేపడుతూ అసోసియేషన్ల నుంచి సొమ్ము చేసుకుంటున్నారనే ఆ రోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి ఔషధనియంత్రణ అధికారులను ప్రభుత్వంనియమించింది ఇందుకేనా? అనే సంశయం ప్రజల్లో కలుగుతోంది.

### జిల్లాలో 500పైగా మెడికల్ దుకాణాలు

జిల్లాలో సుమారు 500కు పైగా మెడికల్ దుకాణాలుండగా అందులో ఎందులోనూ పూర్తిస్థాయిలో ప్రమాణాలు పాటించని మెడికల్ షాపులు ఎన్నో ఉన్నాయి. ఇవన్నీ అధికారుల కళ్ల ముందే కానవస్తున్నా ఔషధ నియంత్రణ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లోనైతే మందుల విక్రయాలను కిరాణాదుకాణాల్లోనే కొనసాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ దుకాణాలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు కూడా కానరావడం లేదు. ఒకవేళ ఔషధ దుకాణాలపై దాడులు జరిపినా ఆ దుకాణాలు కొన్ని రోజుల్లోపే తెరుచుకోవడం గమనార్హం. అయినా నిబంధనలు పాటించడంలో మెడికల్ దుకాణ యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మెడికల్ దుకాణాలు సీజైన కొన్నిరోజుల్లోపే అవి తెరుచుకుంటున్నాయి. ఇప్పటికైనా ఔషధ నియంత్రణ అధికారులు నిద్ర నుంచి మేల్కొని, కాసులకు ఆశ పడకుండా బినామీ పేర్లతో నడుస్తున్న మెడికల్ దుకాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రైతులు పండించే ప్రతీ ధాన్యం గింజను కొంటాం

● రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



డిచ్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు పండించే ప్రతీ వరిధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. శనివారం డిచ్‌పల్లి సహకార సంఘ పరిధిలోని టీబీపూర్, ఖిల్లా డిచ్‌పల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను రాజు చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమన్నారు. రైతులకు సన్నరకం ధాన్యానికి రూ.2320, దొడ్డురకం ధాన్యానికి రూ.2300లు ఇవ్వడంతో పాటు 500 రూపాయల బోనస్ అందజేస్తామన్నారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని రైతుల శ్రేయస్సే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు అమృతాపూర్ గంగాధర్, పొలసాని శ్రీనివాస్, శ్యామ్‌సన్, మహేందర్‌రెడ్డి, సహకార సంఘ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## పశువుల దాణాకు అజోలా సాగు చేయాలి

● జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి



పాల్దాలో పశువుకు టీకా వేస్తున్న దృశ్యం

మోపాల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు అజోలా సాగు చేసుకోవాలని తద్వారా దాణా ఖర్చు తగ్గించుకోవచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి రైతులకు సూచించారు. నిజామాబాద్ రూరల్ మండలం పాల్దా గ్రామంలో శనివారం గాలికుంటు టీకా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. టీకాల సరళిని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈనెల 15 నుంచి టీకాల కార్యక్రమం ప్రారంభమైందని నవంబరు 14 వరకు సాగుతుందని ప్రతీ గ్రామంలో పాడి రైతులు తప్పనిసరిగా వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని వ్యాధిని అరికట్టవచ్చని వివరించారు. ఈ సందర్భంగా పాల్దా గ్రామ యువ రైతులకు అజోలా గురించి వివరించారు. అజోలా ఒక రకమైన నాచు మొక్క అని నీటిపై తేలియాడుతూ వరి పొలాల్లో, లోతులేని జాలావాసాల్లోనూ పెరుగుతుందని అధిక మాంసకృతులు ఉండి పశువులకు మేపడం వల్ల దాణా ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. పాల్దా, తిర్మన్‌పల్లి గ్రామాల్లో 758 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయడం జరిగిందని మండల పశువైద్య అధికారి బాబురావు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, సత్యలింగం, శ్రీనివాస్, సజ్జద్, యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

## రజినీకాంత్‌కు ఘన సన్మానం



రజినీకాంత్‌ను సన్మానిస్తున్న జిల్లా న్యాయాధికారి, కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):జిల్లా కేంద్రంలోని కాకతీయ విద్యాసంస్థల అధినేత సీహెచ్ రజినీకాంత్‌ను శనివారం జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల,కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతులు ఘనంగా సన్మానించారు. జిల్లాలో అనాథ పిల్లలకు కాకతీయ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యాబోధన చేస్తున్నందుకుగాను వారుఆయనను సన్మానించారు.అనాథపిల్లలకు ఉచితవిద్యాబోధన చేయడం గొప్ప విషయమనివారు అన్నారు.ఆయనతో పాటు ప్రిన్సిపాల్ రణదీశ్‌ను కూడా వారు సన్మానించారు.ఈకార్యక్రమంలో సీపీ,తదితరులు పాల్గొన్నారు.

## హిందూ దేవాలయాలపై దాడికి నిరసన

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ శనివారం నిరసనను తెలియజేశారు. జిల్లా కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సభ్యులు ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నిందితుడి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంపై జరిగిన ఘటనను అన్ని హిందూ సంస్థలు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి దయానంద్, విభాగ్ ప్రముఖ్ కృష్ణ, రమేష్, భజరంగ్‌దళ్ నగర అధ్యక్షుడు అఖిల్, సురేష్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్ బాధితుడికి అందజేత

సిరికొండ అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) సిరికొండ మండలం గడ్కోల్ గ్రామానికి చెందిన తలారి గంగాధర్ ఇటీవల ఫోన్ పోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సిరికొండ ఎస్సై ఎల్.రామ్ సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి మొబైల్ ఫోన్‌ను పట్టుకున్నారు. లభించిన ఫోన్ తలారి గంగాధర్‌కు శనివారం ఎస్సై అందజేశారు. ఆయన వెంట స్థానిక కానిస్టేబుల్ రాకేష్ ఉన్నారు.

# ఏటీసీ కేంద్రాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి : కలెక్టర్



శివాజీనగర్ ఐటీఐలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న న్యాయాధికారిని, కలెక్టర్, సీపీ

● పనులను పరిశీలించిన కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీసెంటర్ (ఏటీసీ) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సంబంధిత అధికారులకు సూచించారు.నిజామాబాద్ నగరంలోని శివాజీనగర్‌లోగల ప్రభుత్వ బాలుర,బాలికల ఐటిఐ ప్రాంగణాలలో నూతనంగా నిర్మిస్తున్న ఏటీసీ భవన సముదాయాల నిర్మాణం పనులను కలెక్టర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటి వరకు చేపట్టిన పనుల నాణ్యతను పరిశీలించిన కలెక్టర్ ఎప్పటిలోగా పనులు పూర్తవుతాయని అధికారులను ప్రశ్నించారు. మరో మూడు మాసాలలో ఏటీసీ కేంద్రాల భవన సముదాయాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. ఇప్పటికే తొలివిడతగా మంజూరు లభించిన నిజామాబాద్, బోధన్, కమ్మర్‌పల్లి ఏటీసీలలో ప్రవేశాలు చేపట్టినందున వీటి భవన నిర్మాణం పనులకు అధిక ప్రాధాన్యత ఇస్తూ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వచ్చేవారం సంబంధితశాఖ ప్రిన్సిపాల్ కార్యదర్శి సైతం నిర్మాణం పనుల పరిశీలనకు వచ్చే అవకాశం ఉన్నందున నాణ్యతతో యుద్ధప్రాతిపదికన పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణచేయాలని సూచించారు.కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

**నిజామాబాద్ లీగల్:** నగరంలోని బాలసదన్‌లో ఆశ్రమం పొందుతున్న అనాథ బాలలకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారికి అన్ని విధాలుగా తోడ్పాటును అందించాలనే ఆశయంతో భవిష్య జ్యోతి ట్రస్ట్‌ను శనివారం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారిని, న్యాయసేవా సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల మాట్లాడుతూ విద్యార్థుల చదువుతోపాటు వారికి అవసరమైన సదుపాయాలను ట్రస్ట్ ద్వారా సమకూరుస్తామని తెలిపారు. కోరిన వెంటనే 30 మంది అనాథ బాలికలకు ఉచితంగా ప్రవేశాలు కల్పించేందుకు ముందుకు వచ్చిన కాకతీయ, రవిపబ్లిక్, నిర్మల హృదయ పాఠశాలల యజమానులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ తరపున కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా నలుగురు అనాథ బాలలను పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ దత్తత తీసుకోవడం అభినందనీయమన్నారు. అనాథ బాలలకు చక్కటి భవిష్యత్తును అందించేందుకు వీలుగా దాతలు భవిష్య జ్యోతి ట్రస్ట్‌కు విరాళాలు అందించి తమ ఉదారత్వాన్ని చాటుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ట్రస్ట్ పేరిట ప్రత్యేకంగా నగరంలోని ఐసీఐసీఐ బ్యాంక్ నాందేవ్‌వాడ బ్రాంచ్ అకౌంట్‌ను తెరవడం జరిగిందని అకౌంట్ నెంబర్ 354705001646, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఐసీఐసీ 003547 నందు డిపాజిట్ చేయవచ్చని ఆమె తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ అనాథ బాలలకు నాణ్యమైన విద్యను అందించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని మహోన్నత సంకల్పంతో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో భవిష్య జ్యోతి ట్రస్ట్‌ను నెలకొల్పడం ఎంతో అభినందనీయమని అన్నారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ అనాథ బాలలను దత్తత తీసుకునే అవకాశం తన అదృష్టంగా భావిస్తున్నానని తాను బదిలీపై వెళ్తున్నప్పటికీ దత్తత తీసుకున్న బాలలకు తన వంతు తోడ్పాటును అందిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికారి టి.శ్రీనివాస్, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.శ్రీకాంత్ బాబు, ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు రజినీకాంత్, సరళ, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి : సీపీ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో ఉన్న సిబ్బంది గల సమస్యలను సీపీ కల్మేశ్వర్ తెలుసుకున్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిబ్బందికి ఉన్నటువంటి వారి సమస్యలు, సందేహాలు మరియు వారి బాగోగుల గురించి సీపీ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు (అడ్మిన్) కోటేశ్వర్‌రావు, బస్వారెడ్డి (లా అండ్ ఆర్డర్), ఆర్మూర్, బోధన్ స్పెషల్ బ్రాంచ్, ట్రాఫిక్, ఆర్మడ్ రిజర్వు సీసీఎస్, సీసీఆర్‌బి, ఏసీపీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్సైలు, పాల్గొన్నారు.

## టీ-హబ్‌లో షార్ట్ సర్క్యూట్

నిజామాబాద్ అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో ఉన్న టీ-హబ్‌లో శనివారం షార్ట్‌సర్క్యూట్ జరిగింది. కార్యాలయంలో ఉన్న ఏసీ వైర్లు ఒకదానికొకటి తగిలి రాపిడితో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. షార్ట్‌సర్క్యూట్ అయిన విషయాన్ని ఆసుపత్రి అధికారులు గోప్యంగా ఉంచారు. విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై ఆసుపత్రి సిబ్బంది దురుసుగా ప్రవర్తించారు.నిత్యం రోగులకు సంబంధించి రక్త పరీక్షలు నిర్వహించే డయాగ్నోస్టిక్స్ కేంద్రంలో విలువైన పరికరాలు ఉన్నాయి.టీ-హబ్‌లో ఫైర్ సేఫ్టీ నిబంధనలు కూడా పాటించడం లేదు.

## ఎమ్మెల్సీ కోదండరాంను కలిసిన ఉద్యోగ జేఏసీ



పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను ఉద్యోగ జేఏసీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ప్రైవేటు హాల్‌లో కోదండరాంను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా ఉద్యోగ సంఘ జేఏసీ చైర్మన్ అలుక కిషన్ కోదండరాంతో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో కార్యదర్శి అమృత్‌కుమార్, టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి శేఖర్, సహ అధ్యక్షుడు చిట్టినారాయణరెడ్డి, నాయకులు పోల శ్రీనివాస్, నాగరాజు, జాఫర్ హుస్సేన్, అతీక్, తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 24న జరిగే మాలల సింహగర్జన జయప్రదం చేయండి

సుభాష్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నవంబరు 24న జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ చెన్నయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో శనివారం గైనిగంగారాం అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నవంబర్ 24న హైదరాబాద్‌లో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో తాళ్లపెల్లి రవి, బూర్గుల వెంకటేశ్వర్లు, రమేష్, కనకరాజు, రాంచందర్, రాములు, కిషన్, నాగరాజు, ఎల్లం, మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణ నుంచి బాలుడు కిడ్నాప్

● సీసీ కెమెరాలో నమోదైన కిడ్నాప్ దృశ్యాలు ● ఏడాదిలో జిల్లా ఆసుపత్రి నుంచి రెండో కిడ్నాప్

నిజామాబాద్‌అర్బన్,అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడు కిడ్నాప్ కలకలం సృష్టించింది. కామారెడ్డి జిల్లా మద్నూర్‌కు చెందిన లక్ష్మి అనారోగ్యంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా భర్త రాజుతో పాటు కొడుకు మణికంఠలు ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం రాత్రి పడుకున్నారు. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు రాత్రి సమయంలో మణికంఠను ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరాలో నమోదైంది. ఉదయం లేచి చూసేసరికి కొడుకు కనపడకపోవడంతో రాజు అవాక్కయ్యాడు. తేరుకొని చుట్టుపక్కల ఎంత వెతికిన దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడు కిడ్నాప్‌కు సంబంధించిన వీడియోలు సీసీకెమెరాలో నమోదయ్యాయి. ముగ్గురు వ్యక్తులు బాలుడిని ఎత్తుకెళ్లినట్లు స్పష్టంగా కనబడుతుంది. తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. బాలుడి ఆచూకీ కొరకు రెండు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.



జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి



సీసీ కెమెరాలో నమోదైన బాలుడు కిడ్నాప్ దృశ్యాలు

● జీజీహెచ్‌లో భద్రతా వైఫల్యం

జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో బాలుడు కిడ్నాప్ వ్యవహారంలో భద్రతా వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. సీఐఎస్ఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులు కాపలా ఉన్నప్పటికీ బాలుడు కిడ్నాప్ కావడం భద్రత వైఫల్యాన్ని ఎత్తి చూపుతుంది. ఆసుపత్రిలో రక్షణ వ్యవస్థ పూర్తిగా వైఫల్యం చెందినట్లు స్పష్టమవుతుంది. ఈయేడాదిలో కిడ్నాప్‌కు గురికావడం ఇది రెండో ఘటన, గతంలోనూ ఓ బాలుడు కిడ్నాప్‌కు గురికాగా పోలీసుల గాలింపులో దొరికాడు. ఈయేడాదిలో రెండోసారి జిల్లా ఆసుపత్రిలో కిడ్నాప్ వ్యవహారం వెలుగు చూడటంపై రోగులు, బంధువులు ఆందోళన చెందుతున్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించండి

మోపాల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మోపాల్ మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు పొలాల్లో కోసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబోశారు. ప్రభుత్వం వెంటనే రైతులు కష్టపడించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. ఇప్పటికే మండలంలో అనేక మంది రైతులు వరిధాన్యాలు కోసి రోడ్లపై కుప్పలు తెప్పలుగా పోసి ఉంచారని ఆయా గ్రామాల రైతులు వివరించారు. ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తే వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెం టనే ప్రారంభించే విధంగా చూడాలని కోరారు. వాతావరణం పరిస్థితులు ఏ విధంగా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. ప్రతీ సంవత్సరం రైతుల పంటలు చేతికి రాగానే అకాల వర్షాలతో నష్టపోవాల్సిన పరిస్థితి వస్తోందని ఆ పరిస్థితులు రాక ముందే ప్రభుత్వం వెంటనే గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

● మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**నిజామాబాద్ అర్బన్:** నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు మెప్మా ఆధ్వర్యంలో శనివారం కొనుగోలు కేంద్రాన్ని సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ ప్రారంభించారు. ప్రభుత్వంచే ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని తమ ధాన్యాన్ని ఇక్కడే అమ్ముకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సిబ్బంది, మెప్మా సిబ్బంది, హమాలీలు, దడువాయిలు తదితరులు పాల్గొన్నారు.

● రెండు గ్రామాల్లో కురిసిన వర్షానికి తడిసి ధాన్యం



న్యావనందిలో కురిసిన భారీ వర్షానికి తడిసి ధాన్యం

**సిరికొండ:**సిరికొండ మండలం న్యావనంది, రావుట్ల గ్రామాల్లో శనివారం కురిసన భారీ వర్షానికి ధాన్యం తడిసి ముద్దయ్యింది.శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రైతులు ఎండబెట్టిన ధ ధాన్యంలో వర్షపు నీళ్లు నిలిచి తడిపోయాయని రైతులు ఆందోళన చెందుతు న్నారు. రెండు గ్రామాల్లో సుమారు ఆకస్మతుగా వచ్చిన వర్షం 15, 20 నిమి షాల పాటు కురిసిందని రైతులు తెలిపారు.

## శాంతిభద్రతలు కాపాడలేని సీఎం రాజీనామా చేయాలి: అర్బన్ ఎమ్మెల్యే



ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్‌అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడలేని సీఎం వెంటనే రాజీనామా చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ డిమాండ్ చేశారు.సికింద్రాబాద్‌లో ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం చేసిన ఘటనపై ఆయన స్పందించారు. హిందువులు భక్తిశ్రద్ధలతో కొలుచుకునే ముత్యాలమ్మ విగ్రహాన్ని సలీమ్, సల్మాన్‌లు ధ్వంసం చేశారని, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన జాకీర్ నాయక్‌లను శిక్షించకుండా శాంతియుతంగా ర్యాలీ చేస్తున్న హిందువులపై అమానుషంగా పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఎంఐఎం నాయకుల చేతిలో కీలుబొమ్మలుగా మారి నయా నిజాంగా రేవంత్‌రెడ్డి సీఎం బాధ్యతలు మరిచి ప్ర వర్తిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వ చ్చాక రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలనను గుర్తుకు తెస్తున్నాయని అన్నారు. హిందూ ఆలయాలు, దేవతలపై దాడిచేస్తున్న దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని మరలా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

## రేపు అండర్-19 ఫుట్‌బాల్ ఎంపికలు

సుభాష్‌నగర్,అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):ఈనెల 21వ తేదీన అండర్-19 ఉమ్మడి జిల్లాల ఫుట్‌బాల్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి రవికుమార్ తెలిపారు. నగరంలోని నాగారంలోని రాజారాం స్టేడియంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటల వరకు క్రీడాకారులు మైదానానికి చేరుకోవాలన్నారు. ఈఎంపికలో ఇంటర్మీడియేట్ చదువుతున్న విద్యార్థులు అర్హులని ఫిజికల్ డైరెక్టర్ కె.ప్రసాద్ తెలిపారు. మిగతా వివరాల కోసం 9441631631నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## శాస్త్రోక్తంగా గణపతి హోమం

● పాల్గొన్న గణపతి సచ్చిదానంద స్వామి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):వేదపండితుల వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా గణపతి హోమాన్ని నిర్వహించారు. ఉత్తర తిరుపతి క్షేత్రంలో ఉత్తర తిరుపతి కల్యాణ మండపం శ్రీ జయలక్ష్మీమాత అన్నపూర్ణ మందిర ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం అవధూత దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానం స్వామి పర్యవేక్షణలో గణపతి హోమం శాస్త్రోక్తంగా జరిపారు. వేదపండితులు గణపతి అధర్వణ శీర్షం పఠించగా భక్తులు గణపతి నామాలతో హోమక్రతులను జరిపారు. భక్తులు గణపతి నామంతో పాటు లలితా సహస్రనామ పారాయణం, భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో దత్త పీఠాధిపతి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఐటీఐలలో అడ్మిషన్ల గడువు పెంపు

నిజామాబాద్ అర్బన్,అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు ఐటీఐలలో ఏడో దశ అడ్మిషన్లను ఈనెల 30 వరకు పొడగించినట్లు జిల్లాకన్వీనర్, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాల పైబడిన వారు అర్హులని అడ్మిషన్లకు వయస్సు పరిమితి లేదని ఆసక్తిగల అభ్యర్థులు ఐటిఐ తెలంగాణ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చని అన్నారు. ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకొని ఒరిజినల్ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలని, కోరుకున్న ఐటీఐలలో అడ్మిషన్ల కొరకు ఈనెల 18 నుంచి 30 వరకు నేరుగా హాజరుకావచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9948195654, 9441074767 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## కమాండెంట్‌కు ఘనసన్మానం

డిచ్‌పల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి ఏడో పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన రోహిని ప్రియదర్శిని ఐపీఎస్ అధికారిని శనివారం బెటాలియన్ అధికారులు సన్మానించి ఘనంగా వీడ్కోలు పలికారు. నాలుగు నెలల కాలంలోనే ఉత్తమమైన సేవలు అందించి రోహిని ప్రియదర్శిని బెటాలియన్‌కు గుర్తింపు తెచ్చారని అధికారులు పేర్కొన్నారు.

## నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలి

ధర్పల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన విత్తనాలను సరఫ రా చేయాలని విత్తనాలు, ఎరువుల డీలర్లకు మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్ సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో శనివారం యా సంగి పంట విత్తనాల సరఫరాపై విత్తనాలు ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ షాపుల్లో రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని డీలర్లను ఆదే శించారు. ఈ కార్యక్రమంలో మండల డీలర్లు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## ఎస్సీ,ఎస్టీ తెగల రక్షణ చట్టంపై అవగాహన సదస్సు

నిజామాబాద్ లీగల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి ఆదేశాల మేరకు శనివారం నాడు నిర్వహించిన అవగాహన సదస్సులో షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల రక్షణ చట్టంపై డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య ఉమ్మడి జిల్లాల కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, పోలీసులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఇట్టి సమావేశ కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.రాజేశ్వర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజారెడ్డి, బంటు వసంత్, శ్యామ్‌రావు, బూసారపు రాజేశ్వర్, రహీముద్దీన్, తదితరులు పాల్గొన్నారు.



## చికెన్ ధరలు



| రకం | : లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | : రూ.95 | రూ.220 | రూ. 240 |
| వెన్‌కాబ్ (కిలో) | : రూ.100 | రూ.225 | రూ. 250 |



## బంగారం ధరలు



| బిస్కెట్ (10 గ్రా.) | ఆర్నమెంట్(10 గ్రా.) | వెండి(10 గ్రా.) |
|---|---|---|
| రూ.80,500 | రూ.74,500 | రూ.980 |

## సినిమా గైడ్ నిజామాబాద్

**పీవీఆర్ మల్టీప్లెక్స్..**

స్క్రీన్-1 : వెట్టయన్ (10.10)
: ది వైల్డ్ రోబోట్ (ఇంగ్లీష్ 3డి) (1.40, 7.45, 10.15)
: దేవర (4.10)
స్క్రీన్-2 : ది వైల్డ్ రోబోట్ (ఇంగ్లీష్ 3డి) (10.30)
: విశ్వం (1.00, 7.15)
: జనక అయితే గనక (4.15, 10.30)
స్క్రీన్-3 : ఇద్దరు (10.00)
: లవ్‌రెడ్డి (1.00, 7.30)
: వెట్టయన్ (4.00) : ఖడ్గం (10.30)
స్క్రీన్-4 : రివైండ్ (10.25) : వీక్షణం (1.20)
: జిగ్రా (హిందీ) (4.00)
: విక్కి విద్య కా ఓ వాలా వీడియో (హిందీ) (7.20)
: వెట్టయన్ (10.40)

**ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..**

స్క్రీన్-1 : విశ్వం (10.20, 1.20, 4.20, 10.30)
: దేవర (7.25)
స్క్రీన్-2 : కల్లు కంపౌండ్ (10.40)
: జనక అయితే గనక (1.30, 7.35)
: జిగ్రా (హిందీ) (4.30, 10.30)
స్క్రీన్-3 : వెట్టయన్ (10.30, 1.40, 4.35, 7.40, 10.40)

దేవి: జనక అయితే గనక (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : విశ్వం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : వెట్టయన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : దేవర (11.15, 2.15, 6.15, 9.15)

